# పాడుదేవాలయం

ఆ ముసలితాత రోజూ ఊళ్ళోకి ముష్టికివచ్చేవాడు. ఎక్కణ్ణుంచి వస్తున్నాడో ఎవళ్ళకీ తెలియలే. పాట పాడడు. "బిచ్చం వేయమ్మా" అనన్నా అనడు. ఏమీ మాట్లాడకుండా గుమ్మందగ్గిర నిలబడ్తాడు. పొమ్మంటే పోతాడు. పొమ్మన్న దాకా నవ్వైనా లేకుండా ఆ గుమ్మందగ్గిరే నుంచుంటాడు. ఊరంతా అడుక్కొని సాయంత్రందాకా మావూళ్లో చెరువు గట్టుమీద కూర్చుంటాడు. ఎప్పుడైనా యిటు అటూ కదుల్తాడేమోగాని సాధారణంగా ఎల్లా కూచుంటాడో అలాగే వుంటాడు. ఆతనిగడ్డం మొక్కజొన్నకండెపీచులా తెల్లగా నెరిసిపోయింది చిరిగినపేలికలు కట్టుకున్నా అవి శుభ్రంగావుంటాయి.

అతగాడికళ్ళు చూస్తేమాత్రం ఆ తాత అంటే అందరికీ ప్రేమపుట్టుతుంది. వాటిల్లో ఎన్నో ఆపేక్షలు తిరిగిపోతూ వుంటాయి. ఆ తాతవుండగా బాధపడుతూన్న జంతువేదైనా కనబడితే లేచి తనసంచిలోనుంచి గచ్చాకు వేపో పుచ్చాకు తీసి కట్లు కడ్తాడు. అతను కట్టుకట్టిన జంతువులన్నీ రోగంపోయి ఆరోగ్యంగా వున్నాయన్నమాటే. చెరువుగట్టుమీద ఆ తాత కూచున్నప్పుడే రోగాలతో బాధపడుతున్న పశువుల తోలుకొని అక్కడకు చుట్టుపక్కల వూళ్ళవాళ్ళంతా వచ్చేవారు.

తిండిలేక మాడిపోయే అనేకమంది బీదవాళ్ళకి ఆతాత కుంచాలకొద్దీ బియ్యం యివ్వడం మేం ఎరుగుదుం.

తన బియ్యం ఎక్కడదాస్తాడో వంటచేసేవాళ్ళు ఎవరైనా వున్నారో ఎవళ్ళకీ తెలవదు.

# 2

ఒక రోజున నేనూ నా స్నేహితుడూ బయలుదేరి మావూరుకు దక్షిణంగావున్న అడవిలోకి పోయాం. ఆ అడవిలో ఒక పాడుదేవాలయంవుందని నాకు తెలుసును. ముళ్ళడొంకలు, పల్లేరు చిట్టడవి దాటి గుడిలోపడ్డాం అక్కడ అన్నీ ఇటికెలే. ఉట్టిగోడలు మధ్య అసలుగుడితప్ప ఇంకేమీ లేవు. నాలుగైదు విగ్రహాలుంటే అవన్నీ మావూళ్ళో కొత్తగా కట్టించిన గుళ్ళోకి తీసికెళ్ళారు. కాని ఇంకా అక్కడ ఎన్నో రాళ్ళస్థంభాలు శాసనాలు చెక్కిన రాళ్ళు వున్నయి. విరిగిపోయిన విగ్రహాలు చెక్కడాలు చాలా వున్నాయి. అందుకనే పురాతన శిల్ప పరిశోధకసంఘమువారు "ఇక్కడుండే వస్తువులు ఒక్కటీ ముట్టుకోకూడదని" గవర్నమెంటు వుత్తరువు ఒక బల్లమీద రాయించి అక్కడ పాతేయించారు. ఆ గుడి చాలా పెద్దది. ఆ చిత్రాలన్నీ చూపిస్తూ నాకు తెలిసిన ఆ పాడు దేవాలయగాథ లేవేవిటో మా స్నేహితుడికి చెపుతూంటే సాయంత్రమైంది.

సప్తమినాటి చంద్రుడు బాగా కాంతులు చిమ్మాడు. ఆ వెన్నెల్లో ఆ పాడు దేవాలయం మాకు చాలా అందంగా కనబడింది.

# 3

ఇంతట్లో ఒకగంట వినబడింది. ఇద్దరంహడిలిపోయాము. ఆ అడివిలో ఖంగు ఖంగుమని గం టెక్కణ్ణుంచి వచ్చింది. ఎద్దులగంటేమో అని అనుకుని దేవతలు దెయ్యాలు జ్ఞాపకం వచ్చి ఇఖ యిక్కడ వుండకూడదస అనుకుంటూ ఆగోడలన్నీ

దాటి బయటపడ్డాం. ఇంటికి వెడదామని దారిపట్టాం. చటుక్కున మళ్ళీ వినిపించిదయ్యా ఆ గంట! ఈపట్టు గుళ్ళోంచే స్పష్టంగా మాకు వినుపించింది. ఒకళ్ళమొఖాలు ఒకళ్ళు చూసుకొన్నాం. తప్పకుండా ఇది ఏమిటో-అనే అనుకున్నాం.

గబ గబ దారిలోకివచ్చి నిలిచాం. అయినా ఆ స్థలం వదల్లేక అక్కడే నిల్చొని చెవియిచ్చివినడం ఆరంభించాం. మాకు మంచిస్థాయిలో పాటలు వినిపించడం ప్రారంభించాయి. ఏమయితే అయింది, ఇంగ్లీషు చదువుకున్నాం, మానిఘంటువుల్లో పిశాచాలు లేవు; మనకిమాత్రం భయం ఎందుకురా! తెల్లవాడైతే భయపడ్తాడా? పదంటే పదనుకొని ఇటూ అటూ చూస్తూ నెమ్మదిగా ఆ పాడుగుళ్ళో ప్రవేశించాం. గర్భగుడి ముందరికి వెళ్ళాం. అక్కడ మాకు నీడల పంపిస్తూ అఖండం లాంటి దీపం కనబడింది. ఇది కొరివిదెయ్యం కాదుగదా అనిపించింది.

గర్భగుడి మొదటిగుమ్మందాటేప్పటికి పూర్వం విగ్రహంవుండే పీఠాని కెదురుగుండా పూజచేస్తూ ఒక మనుష్య రూపం కనిపించింది. లోపలిగుమ్మం దాటి వెళ్ళాం.

అక్కడ మాకు కలిగిన ఆశ్చర్యం ఏమిటంటే; మా పూళ్ళో ముష్టెత్తుకొనే ముసలితాతే అక్కడ పూజచేస్తున్నాడు. స్పష్టంగా ఏమీ శబ్దస్వరదోషాలు లేకుండా సంస్కృత మంత్రాలు మహాప్రవాహంలా ఉచ్చరిస్తున్నాడు. స్తంభాల్లా అలాగే నిలబడ్డాం ఇద్దరమూ. ఆ విగ్రహంలేని ఆ పీఠానికే పువ్వులతో పూజచేశాడు. హారతి ఇచ్చాడు, నైవేద్యం పెట్టాడు.

# 4

అందాకా అలాగే నిలబడ్డ మమ్మల్ని చూసి లేవగానే మా కా పువ్వులు ఇచ్చాడు. తలవంచుకొని ఆ ప్రసాదం శిరస్సుమీద వుంచుకున్నాం.

నేను: ఎవరు నువ్వు? ఇక్కడేనా ఏమిటి నువ్వు వుండడం?

ముసలి తాత మాట్లాడ లేదు

నా స్నేహితుడు: అయ్యా ఎన్నాళ్ళనుంచి పూజ చేస్తున్నారండి మీరు?

ఆముసలిభక్తుడు బ్రాహ్మణుడని కనిపెట్టాడు మావాడు.

మా ఇద్దరికేసి ఒక పదినిముషాలు చూసాడు తాత.

ఆ చూపులో ఏమీ కోపం లేదు.

ఇద్దరం ఎందుకో ఆయనకి నమస్కారాలు చేసాం.

కూచోమని సైగచేసి మేంకూచున్న తరువాత అక్కడే పద్మాసనం వేసి కూచున్నాడు మా ముసలితాత.

"నా పూర్వీకులు ఈ దేవాలయానికి పూజార్లు. ఎన్ని శతాబ్దాలనుంచి మాకుటుంబం తరతరంగా ఈదేవుడికి నిత్య నైవేద్యాది పూజలుచేస్తోందో నాకు తెలవదు. చెడుకాలమున ఈ గుడి పాడైపోయింది. ఈ గుడిచుట్టూ ఒక పెద్దపట్టణాం, వుండేది. ఆ సంగతి మీకు తెలుసుననుకుంటా. ఆ పట్టణం, దానికితోడుగా ఈగుడీ పాడైపోయినతర్వాత మా పూర్వీకుల కుటుంబం ఈ సమీపాన్నే ఒక పూరిల్లు వేసుకొని దేవుడికి నైవేద్యాలు, పూజలు నిత్యంగా జరుపుతూండేవారు. చుట్టుపక్కలవూళ్ళవాళ్ళు ఏడాదికొకమాటు ఇక్కడ ఒక తిరు

నాళ్ళ వుత్సవం చేసేవారు అల్లా నాలుగైదు తరాలు పోయే టప్పటికి నిమ్మదిగా ఆ తిరునాళ్ళు మామయ్యాయి...... మా పూర్వీకుల కుటుంబం ఇక్కణ్ణుంచిపోయి ఇక్కడికి పది మైళ్ళలోవున్న......గ్రామం వెళ్ళారు. నువ్వెరుగుదు వా వూరు. కాని వారు ప్రతి ఏకాదశికి వచ్చి ఇక్కడ పూజలు చేసేవారు. రాను రాను మాముత్తాతగారికాలం వచ్చేటప్పటికి ఆయన కుటుంబంతో ఏడాదికి వకసారి ఆ తిరునాళ్ళరోజులకి మాత్రం ఇక్కడకువచ్చి మూడురోజులు పూజలుచేసి వెళ్ళి పోయేవాడు. అల్లాగే మా తాతగారు మా నాన్నగారు విధి కృతంగా పూజలుచేసేవాళ్ళు.

"నేను బియే చదువుతూండగా నాతండ్రిగారుపోయారు. చచ్చిపోయేటప్పుడు నన్ను పిలిచి ఏమో చెప్పాలని అనేక మాట్లనుకొని మళ్ళీ మానేస్తూ చివరకు ప్రాణంపోయేసమ యంలో నన్ను దగ్గిరకు పిలిచి అస్పష్టంగా నాలుగుమాటలాడి ప్రాణం వదిలాడు.

"నేను గుడిమాటే మరిచా. ఏభైఐదేళ్ళదాకా గవర్న మెంటు వుద్యోగాలుచేశా. చివరకు డిప్యూటీకలెక్టరుపనిచేస్తూ పిన్షను పుచ్చుకొన్నా. ఆ వుద్యోగాలు చేసే రోజుల్లో ఆ తిరునాళ్ళ రోజుల్లో వైద్యులు చెప్పలేని రోగం వచ్చేది. పెన్షనుపుచ్చుకొని మావూరు వచ్చాను. పూజలు పునస్కా రాలు ఎన్నిచేసినా, ఎన్నితీర్థయాత్రలు సలిపినా నాకు ఒక విధమైన మనో చాంచల్యము కలిగింది. మా చుట్టాలు మతి పోతుందనుకున్నారు.

"ఇప్పటికి నాలుగేళ్ళక్రితము మా కిక్కడవున్న దేవాలయంబాపతు వచ్చినపొలము చూడడానికి ఈవూరువచ్చాను. ఆ సమయంలో ఈగుడి చూశాను."

"గుళ్లో అడుగుపెట్టానో లేదో ఏదో రాయితగిలి కళ్ళుతిరిగి పడిపోయాను. అప్పుడు—ఏమిచెప్పను! ఈగుడిఅంతా కళకళలాడిపోయింది. అన్ని వెండి దీపస్థంభాలలో ఆవునేయి దీపాలు, గంటలు, ధూపాలు, బంగారువిగ్రహాలు కనబడ్డాయి. "వత్సా—ఎన్ని వత్సరాలు పూజలులేక వుండనయ్యా" అని స్పష్టముగా వినబడ్డాయి మాటలు!

"అప్పటినుంచి నాఆస్థి దానధర్మాదులుచేశాను. కొంత నాదూరపుచుట్టాలకు ఇచ్చాను. నాకుమారుడు చెన్నపట్నంలో చదువుతున్నాడు. అతనికి కొంతఆస్థి ఇచ్చాను. ఇక్కడకువచ్చి ఈవిధంగా వుంటున్నా!"

ఆ భక్తుడు మానివేశాడు. మేం బయటకువచ్చాం. మా ఆత్మలు అద్భుతానందంతో నిండాయి! దేశమంతా వెన్నెల నిండింది.